సాక్షి విశాఖపట్నం

గురువారం । 21 । ఆగస్టు । 2025



పోర్టులో రష్యా బృందం 8లో



ఎట్టకేలకు డిగ్రీ అడ్మిషన్లు 8లో



సత్తా చాటుతున్న సదరన్ రైల్వే జట్టు 8లో

న్యూస్‌రీల్

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.46.53 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం బుధవారం లెక్కించారు. జూన్ 11 నుంచి ఈ నెల 20 వరకు హుండీల ద్వారా వచ్చిన నగదు, బంగారం, వెండి, విదేశీ కరెన్సీని లెక్కించారు. రూ.46,53,301 నగదు, 84.900 గ్రాముల బంగారం, 795 గ్రాముల వెండి వచ్చింది. యూఎస్ఏకి చెందిన 185 డాలర్లు, సింగపూర్‌కు చెందిన 10 డాలర్లు, యూఏఈకి చెందిన 10 దిర్హామ్స్, సౌదీ అరేబియాకు చెందిన 10 రియాల్, ఖతార్‌కు చెందిన 1 రియాల్, 110 న్యూజిలాండ్ దేశ డాలర్లు, ఉక్రెయిన్‌ను దేవ 100 కరెన్సీ, శ్రీలంక దేశ రూ.20లు, థాయ్‌లాండ్ 70 బట్(కరెన్సీ) వచ్చింది. హుండీ ఆదాయం లెక్కింపులో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, దేవదాయ శాఖ అధికారి టి.అన్నపూర్ణ, దేవదాయ శాఖ తనిఖీదార్ ఎం.శ్రీధర్, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారులు ఎన్.ఆనంద్‌కుమార్, కె.రాజేంద్ర కుమార్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ మధుసూదన్, వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది, గోపాలపట్నం శ్రీహరి సేవ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

'విద్యా శక్తి' బహిష్కరిస్తూ ఉపాధ్యాయ సంఘాల నిర్ణయం



డీఈవో కార్యాలయంలో ఏడీకి వినతి పత్రం అందజేస్తున్న ఫ్యాప్టో సంఘాల ఉపాధ్యాయులు

ఆరిలోవ: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన విద్యా శక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాల(ఫ్యాప్టో) నాయకులు బుధవారం డీఈవో కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమం ప్రకారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు అదనంగా గంటపాటు పనిచేయాల్సి ఉంటుంది. ఈ నిర్ణయాన్ని ఫ్యాప్టో సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ నిరసనలో భాగంగా వారు డీఈవో కార్యాలయంలో అధికారులను కలిసి తమ వినతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏయూ ఇంజనీరింగ్‌లో అడ్మిషన్లు

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ క్యాంపస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు చివరి దశ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్ల డైరెక్టర్ డీఏ నాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత ఉన్న విద్యార్థులు గురువారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని, తమ సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఖాళీగా ఉన్న సీట్ల వివరాలను 23వ తేదీన వెల్లడిస్తారు. విద్యార్థులు 24 నుంచి 26వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చు. సీట్లు పొందిన విద్యార్థుల వివరాలను 28వ తేదీన ప్రకటిస్తారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నీరు 'పల్ల'మెరుగు.. నిజం దేవుడెరుగు.. అన్నది పెద్దల మాట. కొన్ని నెలల క్రితం అచ్యుతాపురం కేంద్రంగా బయటపడిన అంతర్జాతీయ సైబర్ క్రైంలో ఆరోపణలున్న ఓ పోలీస్ అధికారిని తప్పించేందుకు విశాఖకు చెందిన టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే జోక్యం తీవ్ర ఆరోపణలకు తావిస్తోంది. ఈ వ్యవహారంలో సీఐడీ దర్యాప్తుతో ఇప్పటికే నిర్వాహకులపై కేసులు నమోదయ్యాయి. సీఐడీ విచారణ మరింత లోతుకు వెళ్లకుండా సదరు పోలీస్ అధికారికి ఆ సీనియర్ ఎమ్మెల్యే 'పల్ల'కీ మోస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై కూటమి నేతల్లోనే తీవ్ర ఆక్షేపణలున్నాయి.

సైబర్ క్రైం దోషికి పల్లకీ మోత!



అచ్యుతాపురం సమీపంలోని భోగాపురం గ్రామంలో ఉన్న ఈ అపార్ట్‌మెంట్‌లోనే అంతర్జాతీయ స్థాయి సైబర్ క్రైం జరిగేది.. ఈ ఏడాది మే 20వ తేదీన దాడులు జరపడానికి వెళ్లిన పోలీసు వాహనాలను చిత్రంలో చూడవచ్చు.

అచ్యుతాపురం సైబర్ సెంటర్ దర్యాప్తులో పోలీస్ అధికారి పాత్రపై సీఐడీ అనుమానం

- ఆ అధికారి పేరు చేర్చకుండా టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే జోక్యం?
- నెలవారీ మామూళ్లతో పాటు భారీ వసూళ్లపై ప్రాథమిక ఆధారాలు
- మరింత లోతైన దర్యాప్తు జరగనీయకుండా అడ్డంకులు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం కేంద్రంగా బీపీవో పేరిట అంతర్జాతీయ సైబర్ క్రైం వ్యవహారం వెలుగు చూసిన విషయం తెలిసిందే. ఈ నేరం బయటకు రావడానికి చాన్నాళ్ల ముందే 'వినాయకుడి'లాంటి ఓ పోలీస్ అధికారి వీరి దందాను గమనించి, దండిగా పిండుకున్నాడు. సీఐడీ విచారణలో ఈ పోలీస్ అధికారి ముడుపులపై ప్రాథమిక ఆధారాలు కూడా లభించినట్లు తెలిసింది. అయితే దర్యాప్తు మరింత లోతుల్లోకి వెళ్లకుండా టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే అడ్డుపడటంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పసిగట్టి.. రూ.కోట్లు పట్టి!

అచ్యుతాపురంలో వంటి ప్రాంతంలో కాల్ సెంటర్(బీపీవో) ఏర్పాటుపై అంతా ఆహా ఓహో అనుకున్నారు. సదరు పోలీస్ అధికారి మాత్రం ఇలాంటి ప్రాంతంలో బీపీవో ఎలా? అన్న అనుమానంతో ఆరా తీయడం మొదలెట్టారు. ఏదో అడ్డగోలు వ్యవహారం నడుస్తుందనే కోణంలో నిర్వాహకుల్ని బెదిరించి మరీ నెలవారీ ముడుపులు, అప్పుడప్పుడూ భారీ మొత్తాలు కలిపి రూ.కోట్లలో వసూలు చేసినట్టు తెలిసింది. సైబర్ క్రైం బాధితులు పైస్థాయిలో ఫిర్యాదు చేయడంతో జిల్లా ఎస్పీ ప్రత్యేక టీంతో విచారణ ప్రారంభించారు. అప్పటి వరకు ఇక్కడ జరుగుతున్న వ్యవహారం తెలిసినప్పటికీ ఆ సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరనీయకుండా సదరు పోలీస్ అధికారి చూసుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ మేరకు ఆధారాలు కూడా సీఐడీ విచారణలో లభించినట్లు తెలుస్తోంది.

టీడీపీ ఎమ్మెల్యే జోక్యంతో..!

టీడీపీకి చెందిన సీనియర్ ఎమ్మెల్యే రంగంలోకి దిగడంతో సీఐడీకి చేతులు కట్టేసినట్టయింది. సదరు ఎమ్మెల్యే తన సామాజిక వర్గానికే చెందినవారు కావడంతో ఆ పోలీస్ అధికారి కులం కార్డు బయటకు తీశారు. దీంతో సదరు పోలీస్ అధికారి

పేరు విచారణ నివేదికలో చేర్చకూడదంటూ సీనియర్ ఎమ్మెల్యే ఆదేశం

చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తన నియోజక వర్గం కానప్పటికీ, ఆ ఎమ్మెల్యే జోక్యం చేసుకోవడంపై కూటమి నేతలు గుర్రుగా ఉన్నారు. పైగా అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రం పరువు పోగొట్టిన సైబర్ క్రైం వ్యవహారంలో పాత్రధారిగా ఉన్న పోలీస్ అధికారిని ఎలా వెనుకేసుకొస్తారంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. సదరు ఎమ్మెల్యే కేవలం కులం కార్డు మాత్రమే కాకుండా భారీగా ముడుపులు కూడా తీసుకున్నట్లు పోలీస్ వర్గాల్లో చర్చ నడుస్తోంది.



కాల్ సెంటర్ కథాకమామీషు!

ముంబైకి చెందిన ఓ మహిళ అచ్యుతాపురంలో అపార్ట్‌మెంట్లను అద్దెకు తీసుకుని బీపీవో పేరిట సైబర్ క్రైం సెంటర్‌ను ఏడాది కాలంగా నిర్వహిస్తోంది. ప్రధానంగా ఈశాన్య రాష్ట్రాలకు చెందిన అమ్మాయిలను ఇందులో ఉపయోగించుకున్నారు. పవన్ రెసిడెన్సీ వేదికగా సాగిన ఈ వ్యవహారంలో అవసరమైన స్టాఫ్‌ను హైదరాబాద్, గుజరాత్‌ల్లో రిక్రూట్ చేశారు. అమెరికన్లను వలవేసేందుకు ప్రత్యేకంగా అమెరికన్ యాక్సెంట్ ఇంగ్లిష్‌లో మాట్లాడేలా వీరికి తర్ఫీదు ఇప్పించారు. అమెరికా ఈ-కామర్స్ పేరుతో ఫోన్లు చేసి కూపన్లు వస్తాయంటూ ఎరవేసి డబ్బులు లాగేసేవారు. ఎవరైనా చెల్లించకపోతే తమదైన శైలిలో ఫేక్ వీడియోలతో భయపెట్టి రూ.50 కోట్ల వరకూ కొల్లగొట్టినట్టు తేలింది. ఇతర రాష్ట్రాలతో లింకులు ఉండటంతో పాటు లోతుగా విచారణ చేయాల్సిన కేసు కావడంతో సీఐడీ రంగంలోకి దిగింది. సీఐడీ విచారణలో ఓ పోలీస్ అధికారి సైబర్ క్రైం గురించి పక్కాగా తెలియనప్పటికీ.. ఏదో వ్యవహారం నడుస్తోందన్న సమాచారంతో భారీ వసూళ్లకు పాల్పడినట్టు తేలింది. అయినప్పటికీ సదరు పోలీసు అధికారిపై కేసు నమోదు చేయకుండా టీడీపీ ఎమ్మెల్యే జోక్యంతో వ్యవహారం సద్దుమణిగినట్టు సమాచారం.



నిందితులను అరెస్టు చేసి తీసుకెళుతున్న పోలీసులు (ఫైల్)

జోనల్ క్రీడా పోటీలకు విశాఖ ఆతిథ్యం

ఈ నెల 22, 23 తేదీల్లో స్పోర్ట్స్ మీట్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 22, 23 తేదీల్లో విశాఖ వేదికగా జోనల్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. 'అమరావతి ఛాంపియన్‌షిప్ కప్' పేరుతో నిర్వహిస్తున్న ఈ పోటీలలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లా, అనకాపల్లి, విశాఖ జిల్లాల నుంచి 1,800 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. పురుషులు, మహిళలకు కలిపి మొత్తం 10 క్రీడాంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కొమ్మాదిలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్, చంద్రపాలెం, రైల్వే ఇండోర్ స్టేడియంలలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. క్రీడాకారుల కోసం వసతి, తాగునీరు, వైద్య సేవలు, అంబులెన్స్ వంటి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ పోటీలలో విజేతలు ఈ నెల 24 నుంచి 26 వరకు తిరుపతిలో జరిగే ఫైనల్స్‌లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. క్రీడాకారులకు రెవెన్యూ కాలనీలోని జీవీఎంసీ బాలుర హైస్కూల్‌లో, బక్కన్న పాలెం గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో వసతి ఏర్పాటు చేయాలని డీఈవో/ఆర్ఐవోలకు సూచించారు. 30మంది పీఈటీలు/పీడీలను కేటాయించాలని డీఈవోకు సూచించారు. సమావేశంలో జిల్లా స్పోర్ట్స్ అధికారి ఎస్. వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, జోనల్ కమిషనర్ కనకదుర్గ లక్ష్మి, జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ రాజశేఖరరెడ్డి, ఆర్ఐవో మురళీధరరావు పాల్గొన్నారు.

గందరగోళంలో డీఎస్సీ అభ్యర్థులు 8లో

- మెరిట్‌లిస్ట్ వెల్లడించని ప్రభుత్వం
- ఎంపికైన అభ్యర్థులకు మెసేజ్‌లు పంపిస్తామనడంతో ఆందోళన

ఉక్కుకార్మికుల పోరాటానికి వైఎస్సార్‌సీపీ మద్దతు



కేకే రాజుకు వినతిపత్రం అందజేస్తున్న విశాఖ స్టీల్ యూనియన్ నాయకులు, వైఎస్సార్‌టీయూసీ నాయకులు

పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

మహారాణిపేట: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న కార్మికులకు తమ పార్టీ అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు హామీ ఇచ్చారు. ప్రైవేటీకరణను అడ్డుకోవాలని కోరుతూ స్టీల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు బుధవారం మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కె.కె.రాజు, గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డిలకు వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ప్రైవేటీకరణను అడ్డుకున్నారని, కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే 32 విభాగాలకు నోటీసులు జారీ చేసిందని ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా తమ పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో కార్మికులకు అండగా నిలుస్తామని ఆయన భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే, కార్మిక సంఘాలతో కలిసి 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' నినాదంతో వైఎస్సార్ సీపీ తరఫున ఉద్యమిస్తామని కె.కె.రాజు స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్టీల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు కత్రినాయుడు, ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, వైఎస్సార్ స్టీల్ ఎంప్లాయీస్ కాంగ్రెస్ యూనియన్ నాయకులు, ట్రేడ్ యూనియన్ జోనల్ విభాగ అధ్యక్షుడు పీవీ సురేష్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాయపురెడ్డి అనిల్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ చెన్నా జానకిరామ్, ప్రధాన కార్యదర్శి అల్లు శంకరరావు, ద్రోణం రాజు శ్రీవత్సవ పాల్గొన్నారు.

ఆహార నాణ్యతకు 'క్లీ' టీమ్స్



దాబాగార్డెన్స్ : నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం జీవీఎంసీ (గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్) 'క్లీ' (శానిటేషన్ అండ్ హెల్త్ ఎన్‌ఫోర్స్‌మెంట్) పేరుతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందాలు నగరంలోని అన్ని జోన్‌లలో 'ఈట్ రైట్ క్యాంపెయిన్' ద్వారా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. నగరంలోని ప్రతి జోన్‌లో రెండు చొప్పున మొత్తం 16 'క్లీ' బృందాలు పనిచేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ బృందాలు హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, వీధి వ్యాపారుల వద్ద ఆహార నాణ్యత, పరిశుభ్రత, నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై నిఘా ఉంచుతాయి. ఇప్పటివరకు 8 జోన్‌లలో 76 చోట్ల తనిఖీలు నిర్వహించి, 71 ఆహార విక్రయ కేంద్రాలకు నోటీసులు ఇచ్చారు. ఇప్పటికే 50 చోట్ల నుంచి రూ.68,600 అపరాధ రుసుం వసూలు చేశామన్నారు.

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

మహారాణిపేట: నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో విశాఖలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభమైంది. మంగళగిరి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కేంద్రాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ హబ్ యువతకు, స్టార్టప్‌లకు ఒక వేదికగా నిలవనుంది. వీఎంఆర్డీఏ డెక్ భవనంలో ఏర్పాటు చేసిన ఈ హబ్‌ను ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఒక గేమ్ చేంజర్‌గా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అభివర్ణించారు. ఈ హబ్‌కు సీఈఓగా రవి ఈశ్వరపు, కన్వీనర్‌గా జేసీ కె. మయూర్ అశోక్ వ్యవహరిస్తారని తెలిపారు. అలాగే ఎనిమిది ప్రముఖ సంస్థలు ఈ హబ్‌తో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఇందులో టీఐఈ వైజాగ్, ఐటీఏఏపీ వంటి సంస్థలు ఉన్నాయి. భవిష్యత్తులో స్టార్టప్‌లకు అవసరమైన అన్ని సహాయ సహకారాలను ఈ హబ్ అందిస్తుంది. జీఎంఆర్ ప్రతినిధి టాటాతేజ, దివిస్ ల్యాబ్స్ నుంచి డాక్టర్ సురేష్, ఆర్సెలార్ మిట్టల్ నుంచి ఎం.రవీంద్రనాథ్, ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ధనుంజయరావు, గీతం నుంచి డాక్టర్ రాజాపప్పు, ఐఐపీఈ నుంచి డాక్టర్ విజయ్ జ్ఞాన, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



ఎంవోయూలు కుదుర్చుకున్న పలు సంస్థల ప్రతినిధులు

అడ్డగోలుగా జీవీఎంసీ లీగల్ సెల్

సీనియర్ న్యాయవాది సత్యనారాయణ 8లో

జీవీఎంసీ జోన్ల పునర్వ్యవస్థీకరణ

- జోన్లు రద్దు చేసి నియోజకవర్గాల వారీగా వార్డులు
- ఒకే నియోజకవర్గంలోని వార్డులతో కొత్త జోన్ ఏర్పాటు
- జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం కోసం అజెండాలో 38వ అంశంగా చేర్చిన అధికారులు

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ పరిపాలనలో అనూహ్య మార్పులు చోటుచేసుకోనున్నాయి. అస్తవ్యస్తంగా ఉన్న జోన్ వ్యవస్థ స్థానంలో నియోజకవర్గం యూనిట్‌గా కొత్త జోన్లు ఏర్పాటు కానున్నాయి. పరిపాలన సౌలభ్యం, పారదర్శకత కోసం ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో దీనిపై చర్చించి ఆమోదించడానికి ఈ అంశాన్ని అజెండాలో చేర్చారు. గత కౌన్సిల్ సమావేశంలో టేబుల్ అజెండా - 1గా సభ్యుల దృష్టికి వచ్చినప్పటికీ వాయిదా వేశారు. ఇప్పటి వరకు జీవీఎంసీ పరిధిలో 8 జోన్లు ఉన్నాయి. ఒక్కో జోన్ పరిధిలో 8 నుంచి 15 వరకు వార్డులు ఉన్నాయి. ఒక్కో జోన్ రెండు, మూడు నియోజకవర్గాల పరిధిలో ఉంది. దీంతో పరిపాలన సక్రమంగా జరగడం లేదని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విధానాన్ని మార్పు చేయాలని దీర్ఘకాలంగా డిమాండ్ ఉంది. దీంతో ఒక్కో నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని జోన్లు ఏర్పాటు చేస్తే పరిపాలన సులభతరం అవుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతమున్న 8 జోన్లను 8 నియోజకవర్గాల జోనల్ కార్యాలయాలుగా మార్చనున్నారు.



వార్డుల మార్పులు ఇలా...

జోన్ - 2 పరిధిలో ఇప్పటి వరకు 9, 10, 11, 12, 13వ వార్డులు ఉన్నాయి. వాటిని విశాఖ తూర్పు జోన్‌లో విలీనం చేయనున్నారు. జోన్ - 3లోని 14వ వార్డును ఉత్తర జోన్‌లోని 15వ వార్డును తూర్పు జోన్‌లో, 27వ వార్డును దక్షిణ జోన్‌లో విలీనం చేయనున్నారు. జోన్ - 4 పరిధిలో ఉన్న 28వ వార్డును విశాఖ తూర్పులో, 41వ వార్డును దక్షిణంలో కలపనున్నారు. జోన్ - 8 పరిధిలోని 42వ వార్డును ఉత్తరంలో, 89, 90, 91, 92వ వార్డులను పశ్చిమలో, 93వ వార్డును పెందుర్తిలో, 98వ వార్డును భీమిలిలో కలపాలని ప్రతిపాదించారు. జోన్ - 6లో ఉన్న 72, 79, 88వ వార్డులను పెందుర్తిలో, 78, 85వ వార్డులను గాజువాకలో విలీనం చేయనున్నారు.

నియోజకవర్గాల వారీగా జోన్లు

నియోజకవర్గాల వారీగా జోన్లు ఏర్పాటు చేయాలని అధికారులు, పాలకవర్గం ప్రతినిధులు భావిస్తున్నారు. దీని ప్రకారం విశాఖలో 8 నియోజకవర్గాల పరిధిలో విస్తరించిన జీవీఎంసీని 8 జోన్లుగా విభజించనున్నారు. ఇకపై ఒక నియోజకవర్గానికి ఒక జోనల్ కార్యాలయం ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకే జోనల్ కార్యాలయం పరిధిలో రెండు, మూడు నియోజకవర్గాల పరిధి ఉండే అవకాశం లేకుండా వార్డుల విలీన ప్రక్రియను చేపడుతున్నారు. భీమిలి జోన్‌లో 9 వార్డులు, తూర్పులో 15, ఉత్తరలో 17, దక్షిణలో 13, పశ్చిమలో 14, గాజువాకలో 17, అనకాపల్లిలో 5, పెందుర్తి జోన్‌లో 8 వార్డులు ఉండనున్నాయి. ఈ నూతన వ్యవస్థకు ఆమోద ముద్ర వేసేందుకు కౌన్సిల్‌లో చర్చించనున్నారు. కౌన్సిల్‌లో ఆమోదం తర్వాత తదనుగుణంగా ఏర్పాట్లు చేయనున్నారు.

కొత్త జోన్ల స్వరూపం ఇలా...

భీమిలి జోన్ : జీవీఎంసీ 1 నుంచి 8 వరకు, 98వ వార్డు

తూర్పు జోన్ : 9 నుంచి 13 వరకు, 15 నుంచి 23 వరకు, 28వ వార్డు

నార్త్ జోన్ : 14, 24, 25, 26, 42 నుంచి 51 వరకు, 53, 54, 55వ వార్డు

సౌత్ జోన్ : 27, 29 నుంచి 39 వరకు, 41వ వార్డు

వెస్ట్ జోన్ : 40, 52, 56 నుంచి 63 వరకు, 89 నంచి 92 వరకు

గాజువాక జోన్ : 64 నుంచి 76 వరకు, 78, 85, 86, 87వ వార్డు


అనకాపల్లి జోన్ : 80 నుంచి 84 వరకు

పెందుర్తి జోన్ : 77, 79, 88, 93 నుంచి 97 వరకు.

బెడ్ షీట్లలో భారీ అవినీతి

- వివిధ రైల్వే జోన్ల పరిధిలో బెడ్ షీట్స్ కుంభకోణం
- ఏసీ కోచ్ ప్రయాణికులకు బెడ్ షీట్స్ సరఫరా
- ఏటా వీటిని కొనుగోలు చేస్తున్న ఆయా రైల్వే జోన్లు
- ఒక్కో జోన్ పరిధిలో ఒక్కో ధరకు బెడ్ షీట్స్ కొనుగోలు


సాక్షి, విశాఖపట్నం: ఇటీవల రైల్వే శాఖలో అవినీతి తారస్థాయికి చేరుకుంటోంది. డీఆర్ఎంలు, సీనియర్ ఇంజినీర్లు వరుసగా సీబీఐ దాడుల్లో పట్టుబడుతున్న నేపథ్యంలో మరో కుంభకోణం బట్టబయలైంది. కాదేదీ కుంభకోణానికి అనర్హం అన్నట్లుగా ఏసీ కోచ్‌లలో సరఫరా చేసే బెడ్‌షీట్ల కొనుగోళ్లలోనూ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఒక్కో జోన్ పరిధిలో ఒక్కో ధరకు బెడ్‌షీట్లు కొనుగోలు చెయ్యడం చూస్తుంటే భారీగా ముడుపులు చేతులు మారుతున్నట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా దక్షిణ మధ్య రైల్వే జోన్ ఈ విషయంలో ముందువరసలో ఉంది. సాధారణంగా కొన్ని జోన్‌లు ఒక్కో బెడ్‌షీట్ రూ.147కి కొనుగోలు చేస్తుండగా అనేక జోన్లు మాత్రం ఏకంగా రూ.300కి పైగా కొనుగోలు చెయ్యడం వెనుక భారీ అవినీతి దాగి ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండేళ్ల క్రితం సీబీఐ దర్యాప్తు చేపట్టినా మళ్లీ ఈ కుంభకోణం వ్యవహారం షురూ అయ్యింది. దీంతో మరోసారి సీబీఐ దీనిపై దృష్టిసారించడంతో అన్ని రైల్వే జోన్లలో ఈ బెడ్‌షీట్ల కుంభకోణం బట్టబయలయ్యే అవకాశాలు స్పష్టమవుతున్నాయి.



ఇండియన్ రైళ్లలో థర్డ్ ఏసీ, సెకెండ్ క్లాస్, ఫస్ట్ క్లాస్ ఏసీ కోచ్‌లలో ప్రయాణికులకు బెడ్‌షీట్లు సరఫరా చేస్తుంటారు. ఈ బెడ్‌షీట్లను అన్ని జోన్లు దాదాపు ఒకే దగ్గర కొనుగోలు చేస్తుంటాయి.

కొన్నాళ్ల క్రితం ఓ రైలులో బెడ్‌షీట్లు నాసిరకంవి సరఫరా చేసినట్లు ఓ ప్రయాణికుడు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఆరాతీసిన రైల్వే బోర్డు ఉన్నతాధికారులకు దిమ్మతిరిగే షాక్ కలిగింది. ఈ బెడ్‌షీట్ల కొనుగోలు వెనుక భారీ కుంభకోణం జరిగినట్లు గుర్తించారు. సుమారు అన్ని జోన్లలోనూ ఇదే తరహా వ్యవహారం నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నాసిరకం బెడ్‌షీట్లపై దర్యాప్తు చెయ్యగా దాని వెనుక ఉన్న బండారాన్ని బయటకు లాగే పనిలో సీబీఐ అధికారులు మరోసారి నిమగ్నమైనట్లు సమాచారం. 2023 నుంచి ఈ కొనుగోళ్ల వ్యవహారంలో అవినీతి రాజ్యమేలుతున్నట్లు గుర్తించారు.

అక్కడ రూ.147.. కానీ.. ఇక్కడ మాత్రం రూ.377



దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఈ బెడ్‌షీట్లను కాన్పూర్‌కి చెందిన సహకారి సమితి లిమిటెడ్ వద్ద కొనుగోలు చేసినట్లు గుర్తించారు. దాదాపు రూ.7.86 కోట్లతో 2,54,657 బెడ్‌షీట్లను కొనుగోలు చేసినట్టు తెలుస్తోంది. ఈస్ట్‌కోస్ట్‌రైల్వే రూ.141.75కి కొనుగోలు చెయ్యగా.. ఈస్ట్రన్ రైల్వే జోన్ రూ.189 వెచ్చించారు. కానీ దక్షిణ మధ్య రైల్వే మాత్రం 2023లో ఏకంగా రూ.377 కి కొనుగోలు చేసింది. దీనిపై సీబీఐ అధికారులు దర్యాప్తు చేశారు. కుంభకోణాన్ని బట్టబయలు చేశారు. అయినా అదే కుంభకోణం మరోసారి జరుగుతున్నట్లు తెలుస్తోంది. దాదాపు అన్ని రైల్వే జోన్లు అధిక ధరకు ఈ బెడ్‌షీట్లను కొనుగోలు చేసి భారీగానే లబ్ధి పొందుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెట్టింపు కంటే ఎక్కువ ధరకు కొనుగోలు చెయ్యాల్సిన అవసరం ఏముందనే అంశంపై సీబీఐ ఆరా తీస్తోంది. ఇప్పటికే అన్ని జోన్లలో గత ఐదేళ్ల కాలంలో బెడ్‌షీట్లను ఎంత ధరకు కొనుగోలు చేశారు..ఎందుకు కొనుగోలు చేశారనే ఫైళ్లని సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని రైల్వే జోన్లు దాదాపు 63 శాతం అధిక ధరను బెడ్‌షీట్ల కోసం వెచ్చించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు చేసేందుకు సిద్ధమవుతోందని తెలియడంతో ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్‌లోనూ కలకలం మొదలైంది. మొత్తంగా ఈ బెడ్‌షీట్ల కుంభకోణం బట్టబయలైతే.. దాదాపు 10 జోన్లలో ఉన్నతాధికారులు ఇందులో చిక్కుకునే అవకాశం ఉందని రైల్వే వర్గాలు భావిస్తున్నాయి.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రేమ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన ఉపాధ్యాయులు ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తులను డీఈవో కార్యాలయానికి అందజేయాలని ఆయన సూచించారు. ఈ అవార్డుల కోసం సెకండరీ గ్రేడ్, స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయుల కేటగిరీల వారీగా దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. అవార్డులకు దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులకు కనీసం 10 ఏళ్ల సర్వీసు ఉండాలని, ఎలాంటి క్రమశిక్షణ చర్యలు లేదా క్రిమినల్ కేసులు నమోదై ఉండకూడదని డీఈవో స్పష్టం చేశారు.

నోడల్ ఆఫీసర్‌గా జీవీఎంసీ కమిషనర్

అల్లిపురం: మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్, నేషనల్ కోస్టల్ మిషన్ స్కీమ్, నోడల్ మిషన్ స్కీమ్ నోడల్ ఆఫీసర్‌గా జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ నియమితులయ్యారు. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ స్కీమ్‌లో భాగంగా అంతర్జాతీయ కోస్టల్ దినోత్సవం సందర్భంగా 13 రాష్ట్రాల్లో సెప్టెంబర్ 20న అంతర్జాతీయ క్లీనప్ డేగా నిర్వహించనున్నారు. కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జీవీఎంసీ కమిషనర్‌తో పాటు కాకినాడ మున్సిపల్ కమిషనర్ భావనను నోడల్ ఆఫీసర్లుగా నియమించారు.

పోర్టులో రష్యా బృందం

సాక్షి, విశాఖపట్నం : ప్రభుత్వ, విద్యా రంగం, ప్రైవేట్ పరిశ్రమల ప్రతినిధులతో కూడిన 14 మంది రష్యన్ బృందం విశాఖ పోర్ట్ అథారిటీ (వీపీఏ)ని బుధవారం సందర్శించింది. ఈ బృందానికి పోర్ట్ అధికారులు ఆత్మీయ స్వాగతం పలికారు. విద్య, నైపుణ్య శిక్షణ, పరిశ్రమ రంగాలలో భాగస్వామ్య అవకాశాలను పరిశీలించేందుకు మూడు రోజుల పాటు ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈ బృందం పర్యటిస్తోంది. ఇందులో భాగంగా.. పోర్టుకు వచ్చిన అధికారుల బృందం.. పోర్ట్‌లోని మౌలిక వసతులు, సరుకు నిర్వహణ సామర్థ్యాలు, ఆధునీకరణ, యాంత్రీకరణ చర్యలు, కవర్డ్ స్టోరేజ్ సదుపాయాలు, సౌర శక్తి వినియోగం, పారిశ్రామిక అవసరాల కోసం ఎస్‌టీపీ మొదలైనవి పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకుంది. విశాఖపట్నం పోర్ట్ ద్వారా దిగుమతి-ఎగుమతి వాణిజ్యాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు ఉన్న పెట్టుబడి అవకాశాలను పోర్టు అధికారులు వివరించారు. భారతీయ నైపుణ్య కార్మికులు రష్యాకు వెళ్లడానికి అనుకూలమైన అవకాశాలను కల్పించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు రష్యా బృందం వెల్లడించింది.

ఎట్టకేలకు డిగ్రీ అడ్మిషన్లు

- ఏయూ పరిధిలో 196 కాలేజీలకు గుర్తింపు
- ఆన్‌లైన్‌లో నమోదుకు ఈ నెల 25 వరకు గడువు
- ఈ ఏడాది కాలేజీలపై తనిఖీలు నిల్
- అనుమతుల్లేకున్నా అడ్డగోలుగా ప్రవేశాలు కల్పిస్తున్న ప్రైవేటు యాజమాన్యాలు
- అకాడమీల పేరుతో కాలేజీల నిర్వహణ
- చోద్యం చూస్తోన్న ఆంధ్ర యూనివర్సిటీ పాలకులు

విశాఖ విద్య : డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు ఎట్టకేలకు బుధవారం ప్రారంభమయ్యాయి. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో చేరేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఉన్నత విద్యామండలి షెడ్యూల్ ప్రకటించడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కాలేజీలకు క్యూ కట్టారు. కాలేజీల్లో అందుబాటులో ఉన్న కోర్సులపై ఆరా తీసి, అనంతరం మీ సేవా కేంద్రాలు, నెట్ సెంటర్లకు వెళ్లి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఉన్నత విద్యా మండలి ఇచ్చిన షెడ్యూల్ మేరకు ఈ నెల 25 వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉంది. ఆ తర్వాత వెబ్ ఆప్షన్ ద్వారా విద్యార్థులు తమకు నచ్చిన కాలేజీలో చేరవచ్చు.

ఉమ్మడి జిల్లాలో 196 డిగ్రీ కాలేజీలు

ఆంధ్ర యూనివర్సిటీ అఫిలియేషన్‌తో ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 196 డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. వీటిలో ఏటా డిగ్రీ మొదటి సంవత్సరంలో 25 వేల మందికి పైగానే విద్యార్థులు చేరుతుంటారు. ఈ కాలేజీల నిర్వహణకు ఏటా ఆంధ్ర యూనివర్సిటీ అఫిలియేషన్ (గుర్తింపు) ఇస్తోంది. ఉన్నత విద్యామండలి ఆన్‌లైన్ ప్రవేశాల వెబ్‌సైట్‌లో వర్సిటీ అఫిలియేషన్ పొందిన కాలేజీల జాబితానే పెడతారు.



తనిఖీలు లేకుండానే కాలేజీలకు గ్రీన్ సిగ్నల్

విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఏటా డిగ్రీ కాలేజీల్లో తనిఖీలు జరిగేవి. కాలేజీల నిర్వహణకు అనువైన భవనాలు, తరగతి గదులు, అర్హత గల అధ్యాపకులు, ఆట స్థలం, లైబ్రరీ, సైన్స్ ప్రయోగశాలలు, పార్కింగ్ ప్రదేశం ఉండాలి. పోలీసు, జీవీఎంసీ, అగ్నిమాపక శాఖల నుంచి ధ్రువీకరణ పత్రాలు పొందాలి. ఇవన్నీ క్షేత్రస్థాయిలో సవ్యంగా ఉన్నాయా..? లేదా.? అనేది వర్సిటీ నుంచి వెళ్లే టీమ్ తనిఖీ చేసి, నిజనిర్ధారణ నివేదిక ఇచ్చిన తర్వాతే అఫిలియేషన్ జారీ అవుతుంది. ఈ ప్రక్రియ మొత్తాన్ని వర్సిటీలోని కాలేజీ డెవలప్‌మెంట్ కమిటీ (సీడీసీ) పర్యవేక్షిస్తోంది. అయితే ఈ ఏడాది తనిఖీలు లేకుండానే ప్రవేశాలకు ఉన్నత విద్యా మండలి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసింది. ప్రైవేటు కాలేజీలకు మేలు చేకూర్చేలా కూటమి ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకుందనే ప్రచారం జరుగుతోంది.

అనుమతుల్లేకున్నా దర్జాగా అడ్మిషన్లు

విశాఖ జిల్లాలోని మధురవాడలో అకాడమీ పేరుతో విద్యాలయాన్ని నిర్వహిస్తున్న ఓ సంస్థ వర్సిటీ గుర్తింపు లేకున్నా, బీబీఏ, బీసీఏ, ఇతర డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు చేపడుతున్నారు. ఇక్కడ చేర్చుకునే విద్యార్థులను ద్వారాకా నగర్‌లోని ఓ కాలేజీలో పేర్లు నమోదు చేసి, మధురవాడలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఇదేమీ తెలియకుండానే, అక్కడ చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఏయూ పరిధిలోని ఉమ్మడి విశాఖ జిల్లాలో పలు ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో సరైన వసతులు లేవు. అర్హత గల ఫ్యాకల్టీ లేరు. ఇలాంటి కాలేజీల్లో చదువులు సవ్యంగా సాగుతాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. యూనివర్సిటీ పాలకులు ఇలాంటి వాటిపై తమకేమీ సంబంధం లేనట్లుగా చోద్యం చూస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ప్రైవేటులో అడ్మిషన్ల దందా

ఇంటర్మీడియట్ ఫలితాలు ప్రకటించి ఇప్పటికే నాలుగు నెలలు అవుతుంది. ప్రైవేటు డిగ్రీ కాలేజీల యాజమాన్యాల వారు ఇప్పటికే ఇంటర్ పాసైన విద్యార్థులకు గాలం వేసి, వారికి సంబంధించిన అన్ని సర్టిఫికెట్లు సేకరించి, తమ కాలేజీలోనే చేరేలా ఏర్పాట్లు చేసుకున్నారు. దీంతో ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్లు గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఇదిలా ఉంటే కాలేజీల నిర్వహణను ఉన్నత విద్యామండలి పర్యవేక్షిస్తుండగా ఆంధ్ర యూనివర్సిటీ ద్వారా వాటికి అఫిలియేషన్ ఇవ్వడంతోపాటు, పరీక్షలు నిర్వహిస్తున్నారు. వీరి మధ్య సమన్వయ లోపంతో ప్రైవేటు కాలేజీలపై పర్యవేక్షణ పూర్తిగా గాలికొదిలేశారు. దీంతో కూటమి ప్రభుత్వంలో ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్ల దందా కొనసాగుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చాంపియన్ సైనికుడు ఎర్రయ్యరెడ్డి మృతి

తగరపువలస: భీమిలి మండలం రేఖవాని పాలెం పంచాయతీ మరడపాలేనికి చెందిన చాంపియన్ సైనికుడు చిల్ల ఎర్రయ్యరెడ్డి(56) అలియాస్ ఆంబిరెడ్డి బుధవారం మృతి చెందారు. స్వతహాగా కబడ్డీ క్రీడాకారుడైన ఎర్రయ్యరెడ్డి ఆర్మీలో చేరిన తరువాత అదే క్రీడతో తాను విధులు నిర్వర్తిస్తున్న ఏఎస్‌సీ గయ(బీహార్) యూనిట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించి రెండు సార్లు జట్టును మొదటి స్థానంలో నిలిపారు. విధుల్లో ఉండగానే 2001లో ఎత్తైన ప్రదేశం నుంచి కిందికి జారిపడి వెన్నుపూస విరిగింది. పూణెలోని ఆర్మీ పునరావాస కేంద్రంలో ఉంటూ కొత్త జీవితం ప్రారంభించాడు. మిలిటరీ ఆస్పత్రిలో రెండేళ్ల చికిత్స అనంతరం వీల్ చైర్‌లో ఉంటూనే షార్ట్‌పుట్, హ్యాండ్‌బాల్, జావలిన్ త్రో, బాస్కెట్‌బాల్, డిస్క్ త్రో వంటి తనకు అనువైన క్రీడల్లో సాధన చేసి వందలాది పతకాలు, లెక్కలేనన్ని సన్మానాలు పొందారు. దక్షిణ కొరియా, మలేషియా, రష్యా వంటి దేశాల్లో జరిగిన పారా సైనికుల క్రీడల్లో పాల్గొన్నారు. ఈయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. గురువారం మరడపాలెంలో ఎర్రయ్య అంత్యక్రియలు జరగనున్నాయి.



చిల్ల ఎర్రయ్యరెడ్డి (ఫైల్)



మాజీ ప్రధాని వాజ్‌పేయి నుంచి అభినందనలు అందుకుంటున్న ఎర్రయ్యరెడ్డి

ఉపాధ్యాయుల అంతర్-జిల్లా బదిలీలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ: జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల అంతర్-జిల్లా బదిలీల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రేమ్‌కుమార్ తెలిపారు. మ్యూచువల్, స్పౌస్ కేటగిరీల కింద బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు గురువారం నుంచి 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో 'లీప్ యాప్' ద్వారా తమ దరఖాస్తులను సంబంధిత మండల విద్యాశాఖ అధికారులకు పంపించాలి. 22 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తులను పరిశీలించి డీఈవో కార్యాలయానికి పంపించాల్సి ఉంటుంది. డీఈవో కార్యాలయం 23 నుంచి 26వ తేదీ వరకు వాటిని పరిశీలిస్తుంది. అనంతరం డీఈవో 27వ తేదీన దరఖాస్తులను డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయానికి పంపిస్తారు. అక్కడ 28, 29వ తేదీలలో పరిశీలన పూర్తయిన తర్వాత 30వ తేదీన ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందని డీఈవో వివరించారు.

ఫొటోగ్రఫీ గొప్పతనంపై ఆర్కే రోజా ప్రశంసలు

అల్లిపురం: వాస్తవ పరిస్థితులను ఎప్పటికీ గుర్తు చేసే శక్తి ఫొటోగ్రఫీకి ఉందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు ఆర్కే రోజా అన్నారు. 186వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైజాగ్ ఫొటో జర్నలిస్టుల ఆధ్వర్యంలో బీచ్ రోడ్‌లోని విశాఖ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆమె సందర్శించారు. వైజాగ్ ఫొటో జర్నలిస్టులు తీసిన చిత్రాలు, అవార్డులు పొందిన ఫొటోలను ఆమె తిలకించి ప్రశంసించారు. ఒక ఫొటో ద్వారానే వాస్తవ పరిస్థితిని ప్రజలకు తెలియజేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ ఏటా నిర్విరామంగా ఫొటో ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్న వైజాగ్ ఫొటో జర్నలిస్టులను అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, తైనాల విజయకుమార్, గాజువాక వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మాజీ మంత్రి రోజా, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

గందరగోళంలో డీఎస్సీ అభ్యర్థులు

- మెరిట్‌లిస్ట్ వెల్లడించని ప్రభుత్వం
- ఎంపికైన అభ్యర్థులకు మెసేజ్‌లు పంపిస్తామనడంతో ఆందోళన

ఆరిలోవ : డీఎస్సీ 2025 అభ్యర్థులు గందరగోళంలో పడ్డారు. మెరిట్ లిస్ట్ వెల్లడించకుండా ఎంపికైన వారి ఫోన్‌కు మెసేజ్‌లు పెడతామని రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానం ప్రకటించడంతో ఆందోళన చెందుతున్నారు. ఎవరు మెరిట్ లిస్ట్‌లో ఉన్నారో తెలియక తలలు పట్టుకొంటున్నారు. ఉమ్మడి విశాఖ జిలాలో 734 ఉపాధ్యాయ ఖాళీలున్నాయి. వాటి కోసం వేలల్లో అభ్యర్థులు డీఎస్సీ పరీక్ష రాశారు. వారిలో మెరిట్ లిస్ట్‌లో ఉన్నవారిని ఎంపిక చేసి వారి ఫోన్‌కు మెసేజ్‌లు పంపిస్తామని ప్రకటించారు. సాధారణంగా గతంలో డీఎస్సీ ఫలితాల మెరిట్ లిస్ట్ విడుదల చేసేవారు. ఏయే కేటగిరీలలో ఎవరు ఎంపికయ్యారో స్పష్టంగా నిర్దేశించేవారు. దీంతో అభ్యర్థులు వారికి ఎన్ని మార్కులు వచ్చాయి.., వారి ముందు ఎవరు ఉన్నారు.., ఎవరికి ఎక్కువ మార్కులు వచ్చాయి.., మార్కులను బట్టి ఉద్యోగం విషయంలో తన పరిస్థితి ఏమిటి అనే విషయాలు తెలిసేవి. ఇప్పుడు అలాంటి విషయాలు తెలుసుకోవడానికి అభ్యర్థులకు ఆస్కారం లేకుండా పోయింది. విద్యాశాఖ నుంచి మెసేజ్‌లు వచ్చిన అభ్యర్థులు మాత్రమే వారి ఒరిజినల్ సర్టిఫికెట్లు పట్టుకుని జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి హాజరుకావాల్సి ఉంది. వారి సర్టిఫికెట్ల పరిశీలన కోసం డీఈవో కార్యాలయంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దానికోసం ప్రత్యేకంగా ఓ కమిటీ వేసి అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించనున్నట్లు తెలిసింది. ఈ కొత్త విధానం వల్ల ఎవరికి ఎన్ని మార్కులు వచ్చాయో తెలియదు. ఎవరు మెరిట్ జాబితాలో ఉన్నారో తెలియదు. ఎక్కువ మార్కులు వచ్చినవారికి ఉపాధ్యాయ ఉద్యోగం వచ్చిందా..?, తక్కువ మార్కులు వచ్చివారికి వచ్చిందో..? తెలుసుకోవడానికి వీలుపడదని ఉపాధ్యాయ సంఘాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. మరో విశేషమేమిటంటే ఈ విధానం ద్వారా ఎవరు టాపరో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఎన్ని మార్కులు సాధించిన వారికి ఉద్యోగం వచ్చిందో కూడా తెలియదని అభ్యర్థులు అంటున్నారు.

అడ్డగోలుగా జీవీఎంసీ లీగల్ సెల్

- హైకోర్టులో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అంశం పెండింగ్
- అయినా స్టాండింగ్ కౌన్సిల్‌కు నోటిఫికేషన్
- కౌన్సిల్ సమావేశం అజెండాలో 51వ అంశంగా చర్చకు పిలుపు
- ఆ నోటిఫికేషన్ చెల్లదన్న సీనియర్ న్యాయవాది పాక సత్యనారాయణ

డాబాగార్డెన్స్ : జీవీఎంసీలో అనేక తప్పిదాలు జరుగుతున్నాయని సీనియర్ న్యాయవాది పాక సత్యనారాయణ ఆరోపించారు. ఈ మేరకు బుధవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టాండింగ్ కౌన్సిల్‌కు సంబంధించి గత ఏడాది డిసెంబర్ 12న 9241/2007 పేరిట జీవీఎంసీ నోటిఫికేషన్ జారీ చేసినట్టు తెలిపారు. ఆ నోటిఫికేషన్‌లో గ్రాస్ పాయింట్‌ను ఎక్కడా చూపకుండా కేవలం ఓసీ, బీసీ – ఏ, ఎకనామికల్లీ వీకర్ సెక్షన్‌ను మాత్రమే చూపిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారని, ఎక్కడా ఎస్సీ కేటగిరీని చూపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జారీ చేసిన నోటిఫికేషన్ నెంబర్‌తోనే మరలా జారీ చేశారని, ఆ వివరాలు పరిశీలించాలన్నారు. 2022లో ఇచ్చిన నోటిఫికేషన్‌కు, ప్రస్తుత నోటిఫికేషన్‌కు పొంతన లేదని, ఇలా ఎందుకు జరుగుతుందో అధికారులే వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎస్సీలకు జీవించే అధికారం, హక్కులు లేవా? అని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగంలో కల్పించిన హక్కుల్ని హరించేలా జీవీఎంసీ వ్యవహరిస్తోందని, తనకు రిజర్వేషన్ ఉందని, కానీ అవకాశం లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. గతేడాది విడుదల చేసిన నోటిఫికేషన్ ఎట్టి పరిస్థితిలోనూ చెల్లదని స్పష్టం చేశారు. ఈ విషయమై తాను ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించానని, అవేవీ పట్టించుకోకుండా లీగల్ సెల్ అధికారులు నోటిఫికేషన్ జారీ చేయడమంటే కోర్టును ఉల్లంఘించినట్టేనని చెప్పారు. నోటిఫికేషన్ సరిదిద్దకపోయినా, అదనపు అఫిడవిట్‌తో రద్దు చేయకపోయినా తాను మళ్లీ కోర్టుకు వెళ్తానని సత్యనారాయణ హెచ్చరించారు. ఓపెన్ కేటగిరీలో మహిళా రిజర్వేషన్ చూపించకపోవడమంటే మహిళలకు అన్యాయం చేస్తున్నట్టేనని, రాజ్యాంగంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఉన్నా, దానిని అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. 10 శాతం ఉన్న వీకర్ సెక్షన్‌కు స్టాండింగ్ కౌన్సిల్‌లో అవకాశం కల్పిస్తే, 15 శాతం ఉన్న ఎస్సీలకు ఎందుకు అవకాశం కల్పించలేదో చెప్పాలన్నారు. కమిషనర్ తక్షణమే దృష్టి సారించి, నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉంటుండగా, కౌన్సిల్ సమావేశంలో చర్చకు ఎలా పెడతారని ప్రశ్నించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది సత్యనారాయణ

చోరీకి పాల్పడ్డ మహిళ అరెస్ట్

ఎంవీపీ కాలనీ: లాసన్స్ బే కాలనీలోని ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన పద్మ అనే మహిళను ఎంవీపీ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్టేషన్‌లో క్రైమ్ సీఐ చక్రధరరావు బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలు. లాసన్స్‌బే కాలనీలో జి.వీరవెంకట సత్యనారాయణ వర్మ తన కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నారు. వృద్ధురాలైన ఆయన తల్లి పైఅంతస్తులో ఒంటరిగా ఉంటోంది. గుర్తుతెలియని మహిళ ఇంట్లోకి ప్రవేశించి ఆమె కంట్లో కారం కొట్టి చేతికి ఉన్న రెండు బంగారు గాజులను దొంగిలించింది. వృద్ధురాలు విషయం కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ఇంటి బయట ఉన్న సీసీ టీవీ ఫుటేజ్‌ను పరిశీలించగా ఓ మహిళ ఇంట్లోకి ప్రవేశించడాన్ని గుర్తించారు. దాని ఆధారంగా విచారణ జరపగా గతంలో ఆ వృద్ధురాలికి కేర్ టేకర్‌గా ఓ పనిచేసిందని, ఆమెకు ఎరుపు రంగు స్కూటీ ఉందని తెలిసింది. దొంగతనానికి పాల్పడిన మహిళ కూడా ఎరుపురంగు స్కూటీలో వెళ్లినట్లు సీసీ ఫుటేజ్‌లో గమనించారు. ఆ దిశగా విచారణ చేయగా శివాజీపాలెం ప్రాంతానికి ఆమె వెళ్లినట్లు గుర్తించి, ఆమె ఇంటికి వెళ్లి తమదైన శైలిలో విచారణ జరపగా ఆమె నేరాన్ని అంగీకరించింది. బంగారు గాజుల్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు, ఆమెను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ చక్రధర్‌రావు తదితరులు

గంజాయి రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్

అల్లిపురం : ఆంధ్రప్రదేశ్‌ను గంజాయి రహిత రాష్ట్రంగా మార్చాలనే లక్ష్యంతో ఈగల్ ఐజీపీ ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్‌ను ప్రారంభించిందని ఐజీపీ ఆకే రవికృష్ణ తెలిపారు. హోటల్ నోవాటెల్‌లో జరిగిన పొగాకు నియంత్రణపై జరిగిన జాతీయ సదస్సులో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. 'గేట్‌వే సిద్ధాంతం' ప్రకారం పొగాకు వంటి చిన్నపాటి అలవాట్లు డ్రగ్స్‌కు దారి తీస్తాయని ఆయన చెప్పారు. ఈ సమస్యను అరికట్టడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 60,000 విద్యాసంస్థల్లో ఈగల్ క్లబ్‌లను ఏర్పాటు చేసిందని వివరించారు. ఈ క్లబ్‌లలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు గంజాయి, డ్రగ్స్ వంటి వాటి గురించి సమాచారం ఉంటే టోల్-ఫ్రీ నంబర్ 1972కు తెలియజేస్తారు. అలాగే కోట్పా యాక్ట్ 2003 ప్రకారం విద్యాసంస్థల పరిసరాల్లో 100 గజాల వరకు పొగాకు ఉత్పత్తుల అమ్మకాలు నిషేధించామని పేర్కొన్నారు. సమావేశంలో ఈగల్ ఎస్పీ కె.నాగేష్ బాబు ,కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, ప్రజారోగ్య నిపుణులు, పరిశోధకులు, స్వచ్ఛంద సంస్థలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

వివాహితపై అత్యాచార కేసులో ఇద్దరికి రిమాండ్

తగరపువలస: భీమిలి మండలం కొత్త మూలకుద్దుకు చెందిన వివాహితపై అత్యాచారానికి పాల్పడిన కొయ్య రామకృష్ణ, ఒనుము శ్రీనులను భీమిలి పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. పాకదిబ్బకు చెందిన బాధితురాలిపై కొయ్య రామకృష్ణ అత్యాచారానికి పాల్పడగా అతనికి ఒనుము శ్రీను సహకరించినట్లు బాధితురాలి కుటుంబ సభ్యులు నగర పోలీస్ కమిషనర్‌కు ఇటీవల ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. సంఘటన కొద్దిరోజుల క్రితమే జరిగినా భీమిలి పోలీసులు గోప్యత పాటించి, విచారణ చేపట్టారు. వారిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించాక వివరాలను వెల్లడించారు. భీమిలి సీఐ బి.తిరుమలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐటీఐ మిగులు సీట్లకు దరఖాస్తులు

కంచరపాలెం: జిల్లాలో వివిధ ప్రభుత్వ/ప్రైవేట్ ఐటీఐల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 లోగా www.iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 28 మధ్యాహ్నం 1 గంటలోపు వెరిఫికేషన్ చేయించుకోవాలని, 29, 30 తేదీల్లో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న ఐటీఐలో మాత్రమే వారి కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

కేంద్రాన్ని మొండిగా సమర్థిస్తున్న కూటమి

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై సీపీఎం ఆందోళన

డాబాగార్డెన్స్ : విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలను వేగవంతం చేసిందని, రాష్ట్ర కూటమి ప్రభుత్వం దీనికి సహకరించడం దారుణమని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అన్నారు. విశాఖలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆందోళన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను 34 విభాగాలుగా విభజించి, వాటి నిర్వహణ, ఆపరేషన్ పనులను కొత్త కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు కేంద్రం టెండర్లు పిలిచిందని ఆయన పేర్కొన్నారు. దీని వల్ల వేలాది మంది శాశ్వత ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు తమ ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ ప్రైవేటీకరణ వల్ల గాజువాక ప్రాంతం ఎడారిగా మారుతుందన్నారు. 5 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను ఎలాంటి నోటీసులు లేకుండా తొలగించడం అన్యాయమని ఆక్షేపించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలను నరసింగరావు ఖండించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని కార్మికులకు నైపుణ్యం లేదని శ్రీనివాసరావు చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా తోసిపుచ్చారు. దేశంలోనే అత్యంత ఆధునీకరించబడిన ప్లాంట్ విశాఖ స్టీల్ అని, ఇక్కడ పనిచేసే కార్మికులు అత్యంత నైపుణ్యం కలవారని ఆయన సవాల్ చేశారు. దేశంలోని ఇతర స్టీల్‌ప్లాంట్లకు సొంత గనులు ఉన్నప్పుడు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఎందుకు ఇవ్వడం లేదని ఆయన కేంద్రాన్ని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ కుట్ర వెనుక ఆర్సేలార్ మిట్టల్ వంటి సంస్థలకు ప్లాంట్‌ను అప్పగించే ప్రయత్నం జరుగుతోందని, ప్రజలంతా ఏకమై స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలని నరసింగరావు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు ఆర్కేఎస్వీ కుమార్, ఎస్. జ్యోతీశ్వరరావు, యు. రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరసింగరావు

టెర్రస్ పైనుంచి జారిపడి విద్యార్థిని మృతి

తాటిచెట్లపాలెం: ఇంటి టెర్రస్ మీది నుంచి ప్రమాదవశాత్తు జారిపడి విద్యార్థిని మృతిచెందింది. ఫోర్త్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. రైల్వేన్యూకాలనీలోని శివసాయి ఎన్‌క్లేవ్‌లో రైల్వే లోకో పైలట్ వురిటి శ్రీనివాసరావు తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నారు. ఇతని పెద్ద కుమార్తె వర్షిత(19) గీతం కళాశాలలో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతోంది. బుధవారం ఉదయం కాలేజీకి వెళ్లిన ఆమె, రికార్డుల కోసం ఇంటికి తిరిగి వచ్చింది. అనంతరం ఉతికిన బట్టలు తీసుకురావడానికి అపార్ట్‌మెంట్ టెర్రస్ పైకి వెళ్లింది. నేలపై నాచు ఉండడంతో బట్టలు తీస్తున్న సమయంలో దానిపై కాలు వేసిన వర్షిత జారిపోయి కిందికి పడిపోయింది. వాచ్‌మన్ ద్వారా విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించగా.. అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తండ్రి చెప్పిన వివరాల మేరకు ఫోర్త్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.



వర్షిత మృతదేహం

సత్తా చాటుతున్న సదరన్ రైల్వే జట్టు

విశాఖ స్పోర్ట్స్: ఆలిండియా రైల్వే బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో సదరన్ రైల్వే జట్టు సత్తా చాటుతోంది. మూడు రోజుల పాటు రైల్వే స్టేడియంలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో సదరన్, సౌత్‌ఈస్టర్న్, వెస్టర్న్, సౌత్‌సెంట్రల్, సౌత్‌వెస్టర్న్, ఈస్ట్‌కోస్ట్ రైల్వే జట్లతో పాటు ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ జట్టు పోటీపడుతోంది. తొలిరోజు జరిగిన పోటీల్లో ఎస్ఈఆర్‌పై ఎస్‌డబ్ల్యూఆర్ జట్టు, ఎస్‌సీఆర్‌పై ఎస్ఆర్ జట్టు, ఈకోర్‌రైల్వేపై ఎస్ఈఆర్ జట్టు గెలుపొందాయి. సదరన్ రైల్వే జట్టు మూడు మ్యాచ్‌ల్లో, ఐసీఎఫ్ రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించాయి. ఎస్ఈఆర్, వెస్టర్న్ రైల్వే, ఎస్‌డబ్ల్యూఆర్ జట్లు ఒక్కో విజయాన్ని సొంతం చేసుకున్నాయి. ఈ పోటీలను రైల్వే డీఆర్ఎం లలిత్ బోహ్రా, ఆయన సతీమణి జ్యోత్స్న ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్, శాంతారామ్, అధికారులు హరనాథ్, జునుస్, పాటిల్ తదితరులు పాల్గొన్నారు.